సాక్షి
అనకాపల్లి
శనివారం ; 4 ; జనవరి ; 2025



బొమ్మని గీస్తే అచ్చు దిగాల్సిందే...

డ్రాయింగ్, పెయింటింగ్ వేయడంలో తమది అందవేసిన చేయి అని తెనుగుబూడి గురుకులం విద్యార్థులు నిరూపిస్తున్నారు. IIలో



దైవ దర్శనానికి వెళ్లి వస్తూ...

తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి వస్తుండగా.. లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో కారు డ్రైవర్ మృతిచెందాడు. IIలో

ఆకాశం మేఘావృతం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 28.5 నుంచి 29.5 వరకూ, కనిష్ట ఉష్ణోగ్రతలు ఈనెల 4న 17.4 డిగ్రీలు, 5న 17.0 డిగ్రీలు, 6న 18.0 డిగ్రీలు, 7న 18.8 డిగ్రీలు, 8న 19.2 డిగ్రీలుగా ఉంటాయని, గాలి గంటకు 3 కిలో మీటర్లు వీస్తుందని పేర్కొన్నారు.

నేవీడే విన్యాసాలు



- వేడుకలకు సర్వం సిద్ధం
- సీటింగ్‌కు ప్రత్యేక పాస్‌లు మంజూరు
- బీచ్‌రోడ్డులో పటిష్ట భద్రత
- వీక్షకులకు ఉపయుక్తంగా ఎల్ఈడీల ఏర్పాటు



కూర్చునేందుకు వీలుగా ఇసుకలో వేసిన గ్రీన్‌మ్యాట్

ఏయూక్యాంపస్: నావికాదళ విన్యాసాలకు బీచ్ రోడ్డు సర్వాంగ సుందరంగా సిద్ధమవుతోంది. శనివారం సాయంత్రం విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా జరగనున్న నావికాదళ విన్యాసాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారీ సంఖ్యలో సందర్శకులు వచ్చినా వీక్షించేందుకు వీలుగా నేవీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆర్కే బీచ్ నుంచి పోలీస్‌మెస్ వరకు తీరంలో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సందర్శకులు సాగర తీరంలో కూర్చుని ఎల్ఈడీ తెరలపై వేడుకలు వీక్షించవచ్చు. ప్రధాన వేదికకు రెండు వైపులా సీటింగ్, ఇసుక తిన్నెలపై సైతం కుర్చీలు వేసి సీటింగ్ సదుపాయం కల్పించారు. వీటికి ప్రత్యేక పాస్‌లను జారీ చేశారు. సిల్వర్‌స్పూన్ రెస్టారెంట్ నుంచి పోలీస్ మెస్ వరకు ఉన్న ఇసుక తిన్నెలచుట్టూ కేవలం ఫెన్సింగ్ వేశారు. నావికా విన్యాసాలు ప్రారంభమయ్యే సమయానికి గంట ముందుగానే ప్రజలు ప్రాంగణానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నావికా విన్యాసాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు హాజరవుతున్న నేపథ్యంలో పోలీసులు, జీవీఎంసీ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. శనివారం మధ్యాహ్నం నుంచి బీచ్‌రోడ్డులోకి వాహనాలను అనుమతించరు. వీక్షకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైదానాలలో తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి. సాయంత్రం 4.40 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ విన్యాసాలు జరుగుతాయి.

ప్రత్యేక ఆకర్షణగా లేజర్ షో

కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న లేజర్ షో, డ్రోన్ షోలు మరింత కొత్తదనాన్ని తీసుకువస్తున్నాయి. నావికాదళ సిబ్బంది సంగీత బృందం బీటింగ్ రిట్రీట్, తుపాకులతో చేసే కవాతు వారి క్రమశిక్షణ, ఏకాగ్రతలకు ప్రతీకగా నిలుస్తాయి. పెద్దసంఖ్యలో నావికాదళ ఉన్నతాధికారులు, సిబ్బందితో పాటు, నగరవాసులు ఈ విన్యాసాలను తిలకించడానికి రానున్నారు. గతంలో కంటే విస్తృత స్థాయిలో దీనికోసం నావికాదళం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. నేవీ విన్యాసాల్లో యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, ఫైటర్ జెట్‌లు, సబ్‌మెరైన్‌లు భాగం కానున్నాయి. నావికాదళానికి వెన్నెముకగా నిలిచే మెరైన్ కమాండోల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. భారత నావికాదళ సిబ్బంది ధైర్యం, సాహసాలను ప్రజలకు కళ్లకు కట్టినట్టు చూపే విధంగా ఈ కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే జరిగిన రెండు నమూనా విన్యాసాలు విజయవంతమయ్యాయి.



వీక్షకుల గ్యాలరీలో ఏర్పాటు చేసిన కుర్చీలు

ఇక్కడంతా నీడలే మాట్లాడతాయి...!

షాడోలే అసలైన హీరోలు



- ఎమ్మెల్యే కలెక్షన్ కింగ్‌లంతా వీరే...
- కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రధాన అనుచరులదే హవా
- ఏ పని కావాలన్నా వీరు తలూపాల్సిందే...
- పోస్టింగుల నుంచి పైరవీల దాకా అంతా వీరి కనుసన్నల్లోనే...

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: **కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేల నడకను నీడలే** శాసిస్తున్నాయి. ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి ఏ పని చేయాలో...ఏ పోస్టుకు ఎవరిని సిఫారసు చేయాలో.. ఏ పని ఎవరికి అప్పగించాలో అంతా వీరే నిర్ణయిస్తున్నారు. నీడను కూడా నమ్మకూడదనేది పాత సామెత. అంతా నీడను నమ్మి... వారు చెప్పినట్టే చేయాలనేది కూటమి ఎమ్మెల్యేల బాట. కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేల్లో ఎవరి దారి వారిదే. ఒకరు సొంత కుటుంబ సభ్యులను షాడోలుగా పెట్టుకుని పనులు నడుపుతుంటే... మరొకరు బంధువులు, ప్రధాన అనుచరులతో పనులు కానిస్తున్నారు. తమ చేతికి నేరుగా మట్టి అంటుకోకుండా అవినీతి వ్యవహారాలను గుట్టుగా చక్కబెడుతున్నారు. కొద్ది మంది ఎమ్మెల్యేలకు ఏకంగా ఐదు నుంచి పది మంది వరకూ షాడోలుగా వ్యవహరిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. కొందరు కేవలం సొంత కుటుంబ సభ్యులతో మాత్రమే పనులు చక్కబెట్టుకుంటున్నారు. మరి కొందరు తమ ప్రధాన అనుచరులను నమ్ముకుని జేబులు నింపుకుంటుండగా.... ఆరోపణలు వచ్చిన వెంటనే తనకు తెలియకుండా చేశాడని అధిష్టానానికి వివరణ ఇస్తూ పక్కన పెట్టినట్టు నటిస్తున్నారు. మొత్తంగా కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేల్లో మెజారిటీ సభ్యుల నీడలే వ్యవహారాలన్నీ నడుపుతుండటం గమనార్హం.

పెత్తనమంతా వారిదే...!

విశాఖ జిల్లాలోని ఒక్కో ఎమ్మెల్యేది ఒక్కో తీరు. కూటమిలోని ఒక ఎమ్మెల్యే పైకి నిజాయితీపరుడిగా నటిస్తూ.... వ్యవహారాలను మాత్రం ఆయన కుటుంబ సభ్యుల ద్వారా కానిస్తున్నారు. ఆయన లేని సమయంలో ఆయన కుటుంబంలోని వ్యక్తి ప్రారంభోత్సవాలు, సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఇక పలు మార్లు ఎమ్మెల్యేగా గెలిచి... నియోజకవర్గమంతా కొట్టినపిండి మాదిరిగా ఉన్నప్పటికీ... ఆయన లేని సమయంలో ఆయన అనుచరుడు అధికారులపై కేకలు వేస్తూ పనిచేస్తున్నారు. అధిష్టానం నుంచి ఆయనపై ఏ మాత్రం సానుకూల దృక్పథం లేకపోవడంతో దూకుడు తగ్గించిన సదరు ఎమ్మెల్యే.... ఆయన షాడో మాత్రం ఎక్కడా తగ్గేదేలే అంటూ దబాయించి మరీ పనులు చేయిస్తుండటం గమనార్హం. ఇక నగరంలో కూటమిలోని ఓ ఎమ్మెల్యే మాత్రం అంతా పెదరాయుడు టు ధనుష్... ధనుష్ టు పెదరాయుడు అన్నట్టుగా నేరుగా వ్యవహారాలను చక్కబెట్టుకుంటున్నారు. ఎప్పుడూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడనే పేరున్న ఓ ఎమ్మెల్యేకు కుటుంబంలోని ఐదు మంది షాడోలుగా వ్యవహరిస్తున్నారు. సతీమణి, కుమారుడు, అల్లుడు, మేనల్లుడు, బావమరిదితో పెత్తనమంతా సాగుతుండటం ఆయన వద్దకు వచ్చే అందరికీ తెలిసిన విషయమే. మంత్రి పదవి ఆశిస్తున్న మరో ఎమ్మెల్యేకు మాత్రం పోలీసు పోస్టింగుల్లో భార్య తరఫు బంధువు (బావమరిది) ఒకరు భారీగా దండుకోవడంతో విమర్శలు వచ్చాయి. దీంతో తాత్కాలికంగా పక్కన పెట్టినట్టు ప్రచారం చేశారు. వసూళ్లన్నీ ఎమ్మెల్యే జేబులోకి చేరడంతో నియోజకవర్గంలో కనపడకుండా... కేవలం ఇంటికి మాత్రమే వచ్చేలా చూసుకుంటున్నారు. ఇక జీవీఎంసీలోని వ్యవహారాలన్నీ ఇద్దరు కార్పొరేటర్ల ద్వారా ఆయన చూసుకుంటున్నట్టు తెలుస్తోంది.

మండలానికి ఒకరు...!

అనకాపల్లి జిల్లాలోనూ ఎమ్మెల్యేలదీ ఒక్కొక్కరిది ఒక్కో స్టైయిల్. ఇప్పటికే జనసేన అధిష్టానం నుంచి భారీగా విమర్శలు ఎదుర్కొని క్లాసులు పీకుతున్నా.... అస్సలు తగ్గేదేలే అని ఆయన రెచ్చిపోతున్నారు. ఆయన అవినీతి దూకుడుకు ఎవ్వరూ ఆనడం లేదు. ఆయన సోదరుడి అండతో అందినకాడికి దోచుకుంటున్నారు. పరిశ్రమల నుంచి పోస్టింగుల వరకూ... నేవీ నుంచి నరేగా నిధుల వరకూ ఆయనకు అడ్డులేకుండా పోయింది. ఇక మరో ఎమ్మెల్యే నియోజకవర్గంలోని మండలానికో వ్యక్తిని షాడోగా మార్చుకున్నారు. అక్కడ కొత్తగా వెంచర్ వేయాలన్నా.... నిర్మాణాలు చేపట్టాలన్నా వీరి నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. ఈయనకు నియోజకవర్గమంతా మొత్త 10 మంది వరకూ షాడోలుగా వ్యవహరిస్తున్నారు. మరో ఎమ్మెల్యే వ్యవహారాలన్నీ సతీమణితో పాటు కుమారులు చూసుకుంటుండగా... ఇంకో ఎమ్మెల్యే పెత్తనమంతా కుమారుడే దగ్గరుండీ మరీ చక్కబెడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటికీ నుంచి పెద్దగా ఎక్కడా హడావుడి చేయకపోయినప్పటికీ సదరు ఎమ్మెల్యే అల్లుడు మాత్రం ఆర్థిక వ్యవహారాల్లో చక్రం తిప్పుతున్నారు. ఇదే జిల్లాలోని ఒకరు మాత్రం నిత్యం వార్తల్లో ఉంటున్నారు. సదరు ఎమ్మెల్యే అనుచరులు ఇప్పటికే భూకబ్జాలు, పోస్టింగుల్లో భారీగా వసూళ్లకు తెగబడటంతో అధిష్టానం దాకా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో అప్పటివరకు అన్ని వ్యవహారాలను చక్కబెట్టిన సదరు వ్యక్తి తనకు తెలియకుండా చేశాడంటూ దూరం పెడుతున్నట్టు సర్దిచెప్పుకున్నారు. ఈ ఎమ్మెల్యేకు నియోజకవర్గంలోని మండలానికి ఇద్దరు ముగ్గురు షాడోలుగా రెచ్చిపోతున్నారు.

ఎమ్మెల్యే భర్తదే పెత్తనం

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఒక నియోజకవర్గంలో ఎమ్మెల్యే భర్తదే మొత్తం పెత్తనమంతా నడుస్తోంది. ఏ పోస్టింగు కావాలన్నా... ఆయన ఓకే అనాల్సిందే. ఇప్పటికే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు వ్యక్తి... ఎన్ని ఆరోపణలు వచ్చినా ముందుకేనంటూ నీడగా సాగుతున్నారు. ఒక నియోజకవర్గ ఇంచార్జీకి గతంలో పీఏగా వ్యవహరించిన వ్యక్తి ఇప్పటికీ వెనుక నుంచి కథ మొత్తం నడిపిస్తున్నట్టు విమర్శలున్నాయి.

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత

- సాధనకు కార్యాచరణ సిద్ధం చేయాలి
- కలెక్టర్ విజయ కృష్ణన్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: టెన్త్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో విద్యాశాఖకు సంబంధించి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో విద్యా ప్రగతిపై శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరచడం, నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యాలను సాధించడంపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. బోధన విషయంలో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రోజు ఆయా మండల విద్యా శాఖ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాఠశాలకు 5 నిమిషాలు ముందుగానే హాజరుకావాలన్నారు. విద్యార్థుల ఆధార్ అప్‌డేట్, పాఠశాలల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, ఎఫ్ 1, ఎఫ్ 2, మధ్యాహ్నం భోజన పథకం తదితర అంశాలపై ఆమె సమీక్షించారు. ప్రతి సోమవారం విద్యా ప్రగతిపై సమీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. లక్ష్య సాధనలో వెనుకబడినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆగస్టు నెల నుంచి ఇప్పటి వరకు పారామీటర్ల వారీగా ప్రగతి నివేదికలు సమర్పించాలని తెలిపారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పాఠశాలలకు రాని విద్యార్థులపై దృష్టి సారించి పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి విద్యార్థి ఆధార్ వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, మధ్యాహ్న భోజన పథకం అమలులో శుభ్రతకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. సీసీ కెమెరాలు, వాట్సాప్ ద్వారా ఎప్పటికప్పుడు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పర్యవేక్షిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవో జి.అప్పారావునాయుడు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

గోవాడ రైతులకు రూ.3.41 కోట్ల చెల్లింపు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతులకు బకాయిలు చెల్లిస్తున్నట్టు మేనేజింగ్ డైరెక్టర్ వి.వి. సన్యాసినాయుడు చెప్పారు. గత సీజన్‌కు సంబంధించి రైతులకు టన్నుకి రూ. 350 చొప్పున చెల్లించాల్సి ఉందని, ఆ సొమ్ములో శుక్రవారం నుంచి టన్నుకి రూ.200 చొప్పున చెల్లిస్తున్నామని తెలిపారు. 14,791 మంది రైతులకు రూ. 3.41కోట్లు చెల్లించనున్నట్టు చెప్పారు. మిగతా బకాయిలు కూడా త్వరలోనే చెల్లిస్తామన్నారు. ఈ ఏడాది సీజన్‌కు రైతులంతా సహకరించి పూర్తిస్థాయిలో చెరకు సరఫరా చేయాలని ఆయన కోరారు.

ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట(విశాఖ): 2024–25 సంవత్సరానికి ట్రేడ్ అప్రెంటిస్‌షిప్‌ల కోసం అర్హులైన ఐటీఐ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ తదితర ట్రేడ్‌ల్లో మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాల్లో అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి ట్రేడ్‌కు ఏడాది కాలం పాటు శిక్షణ ఉంటుందని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 8,344.60 నుంచి రూ. 9,387.67 వరకు స్టైఫండ్ చెల్లిస్తామన్నారు. 2024 డిసెంబర్ 31 నాటికి 14 ఏళ్లు నిండిన ఐటీఐ అభ్యర్థులు అర్హులని,https:// www. apprenticeshipindia. gov. in ద్వారా ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏకగ్రీవంగా పీసా కమిటీల ఎన్నికలు



కురువాడలో ఉపాధ్యక్షుడు, కార్యదర్శిగా ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న శ్రీగౌరి

నాతవరం: మండలంలోని ఎనిమిది గ్రామాల్లో శుక్రవారం పీసా కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్టు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి నాగశిరీషా తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుస్తుగా నాతవరం ఎస్ఐ సీహెచ్. భీమరాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు. కొత్తగా ఎన్నికైన పీసా కమిటీ ఉపాధ్యక్ష, కార్యదర్శుల పదవీ కాలం ఐదేళ్ల పాటు ఉంటుందని ఆమె తెలిపారు. నూతనంగా ఎన్నికైన పీసా కమిటీలకు ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు అధ్యక్షులుగా వ్యవహరిస్తారు.

నేడు రెండు గ్రామాల్లో..

మండలంలో ధర్మవరం అగ్రహారం, కృష్ణాపురం అగ్రహారంలలో శనివారం పీసా కమిటీ ఎన్నికలు జరుగుతాయని నాగ శిరీషా తెలిపారు. ధర్మవరం అగ్రహారంలో ఎన్నికల అధికారిగా ఎన్.ప్రేమ్‌కుమార్, కృష్ణాపురం అగ్రహారంలో ఎన్నికల అధికారిగా ఈ.దేముడు వ్యహరిస్తారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వారి వివరాలు..

గ్రామం	ఉపాధ్యక్షుడు	కార్యదర్శి
సుందరకోట	జర్తా జోగిరాజు	పాండవుల నూకరాజు
సరుగుడు	పెయ్యల బాలరాజు	మద్దేల గంగాధర్
రామన్నపాలెం	కుంచె నాగేశ్వరరావు	తరంబోయిన రమణ
సిరిపురం	బండి దారబాబు	ఉల్లి చిన్నబ్బాయి
కురువాడ	పాశిల అప్పారావు	సుర్ల వినాయక రాజు
మాధవ నగరం	అల్లి రాఘవ	సామల పైడికొండ
పి.ఎన్.డి.పాలెం	వెలకాడ అప్పారావు	కోరుబిల్లి పోతురాజు
కె.వి.శరభవరం	కర్రిగోపి ప్రసాద్	రేగటి రాజుబాబు

నేడు కశింకోటలో జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

కశింకోట: స్థానిక బాలికల హైస్కూల్‌లో శనివారం జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవో కె.ఎస్.ఎన్. మూర్తి తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు హైస్కూళ్ల విద్యార్థులు తయారు చేసిన 72 నమూనాలను ప్రదర్శించనున్నట్టు చెప్పారు. వీటిలో ఎంపికైన ఉత్తమ నమూనాలను రాష్ట్ర స్థాయికి పంపుతామని, వాటిలో ఎంపికైన వాటికి బహుమతులు అందజేస్తారన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు జరిగే ప్రదర్శనకు కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా విద్యా శాఖ అధికారి జి.అప్పారావు నాయుడు, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తదితరులు హాజరుకానున్నట్టు చెప్పారు.

జైలులో 'సెల్'చల్


- కలకలం రేపుతున్న సెల్‌ఫోన్ల లభ్యత



జైల్ నర్మదా బ్యారక్‌లో అధికారులకు దొరికిన సెల్

ఆరిలోవ(విశాఖ): విశాఖ కేంద్ర కారాగా రంలో సెల్‌ఫోన్లు కలకలం రేపుతున్నాయి. జైల్ బ్యారక్‌లలో వరుసగా సెల్‌ఫోన్‌లు బయటపడుతుండటంతో అధికారులు కంగుతింటున్నారు. నిషేధించిన వస్తువులు జైల్ లోపలకు ఎలా చేరుతున్నా యో అంతుచిక్కక కొత్తగా వచ్చిన అధికారులు తలలు పట్టుకొంటున్నా రు. శుక్ర వారం ఓ సెల్ ఫోన్ లభించింది. నాలు గు రోజుల కిందట రెండు సెల్ ఫోన్‌లు దొరికిన విషయం తెలిసిందే. నాలుగు రోజుల వ్యవధిలోనే రెండు బ్యారక్‌లలో మూడు సెల్ ఫోన్‌లు దొరకడంతో ఇంకెన్ని సెల్ ఫోన్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయో అని అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. తనిఖీల్లో భాగంగా శుక్రవారం నర్మదా బ్యారక్‌ను పరిశీలించినట్లు జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్ బాబు తెలిపారు. ఈ తనిఖీలలో ఆ బ్యారక్ స్టోర్ రూం మెట్ల కింద గచ్చులో చేసిన రంధ్రంలో ఓ డబుల్ సిమ్ సెల్ ఫోన్ దొరికినట్లు తెలిపారు. దాన్ని స్వాధీనం చేసుకుని ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. గత నెల 31న రెండు సెల్ ఫోన్‌లు, ప్రస్తుతం దొరికిన సెల్ ఫోన్లపై ఆరిలోవ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

మరింత మెరుగ్గా 108,104 సేవలు



సిబ్బందితో నోడల్ ఆఫీసర్ మురుగన్ బృందం

చోడవరం రూరల్: 108 అంబులెన్స్‌లు, 104 మొబైల్ మెడికల్ యూనిట్(ఎంఎంయూ)ల సేవలను మరింత మెరుగ్గా అందించడానికి తీసుకోవలసిన చర్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎం.మురుగన్ బృందం తెలిపింది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పర్యటించిన బృందం పలు 108, 104 వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా చోడవరానికి వచ్చిన బృందం ఉద్యోగులతో చర్చించింది. విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంది. సేవల మెరుగునకు వారి నుంచి సలహాలు, సూచనలను స్వీకరించింది. మురుగన్‌తో పాటు జిల్లా 108 విభాగం మేనేజర్ వి.వి.త్రినాథరావు, 104 విభాగం జిల్లా మేనేజర్ అచ్యుతరావు, ఓఈలు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశం

తుమ్మపాల: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లు, పోలీసు, ఇతర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ ఎం.జాహ్నవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశం వివరాలను కలెక్టర్ విజయ్‌కృష్ణన్ విలేకరులకు తెలిపారు. ప్రధానమంత్రి పర్యటనకు విశాఖపట్నం సహా అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల నుంచి ప్రజలను బస్సులు, ఇతర వాహనాల్లో తరలించనున్నందున వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, తాగునీరు, భోజన వసతి వంటి ఏర్పాట్లలో ఎటువంటి విమర్శలకు తావీయకుండా చూడాలన్న సీఎస్ ఆదేశాల మేరకు చర్యలు చేపడతామన్నారు. ట్రాఫిక్, వాహనాల పార్కింగ్ వంటి అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ సభకు జిల్లా నుంచి 40వేల మంది హాజరుకానున్నారని, వారికి 800 బస్సులను, భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు సీఎస్‌కు తెలిపామన్నారు. అచ్యుతాపురం, నక్కపల్లిలలో శంకుస్థాపన వేదికల వద్ద నుంచి వర్చువల్‌గా ప్రధానమంత్రితో ముఖాముఖికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీష రాణి, జిల్లా అదనపు ఎస్పీ ఎం. దేవాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' ఈ ఏడాది నుంచే అమలు చేయాలి



ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నెహ్రూచౌక్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: తల్లికి వందనం పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని కూటమి ప్రభుత్వం యోచించడం సరికాదని, ఇప్పటికే ఎంతోమంది పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు బి.బాబ్జి, జి.ఫణీంద్రలు అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక నెహ్రూచౌక్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబంలో ఎంతమంది చదువుకుంటే అంత మందికీ రూ.15వేల చొప్పున అందజేస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి విద్యార్థులకు అన్యాయం చేయడం సరికాదన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజు, దివ్య, భవాని పాల్గొన్నారు.

ఆర్. భీమవరంలో సినిమా షూటింగ్ సందడి




పూలతోట వద్ద పాట చిత్రీకరణ

బుచ్చెయ్యపేట: మండలంలోని ఆర్.భీమవరం గ్రామ పంచాయతీ పరిధిలో 'వెంకటరామయ్య గారి తాలూకా కేరాఫ్ సీతారాంపురం' సినిమా షూటింగ్ వారం రోజులుగా జరుగుతోంది. పూలతోటల వద్ద పాటను చిత్రీకరించారు. మల్లాం, గోకివానిపాలెం, ఆర్.భీమవరం, చిన భీమవరం తదితర గ్రామాల్లో ఈ సినిమా చిత్రీకరణ జరిగింది. ఈ సినిమాకు డైరెక్టర్ ఆవాలు సతీష్. హీరో (జయమ్మ పంచాయతీ హీరో) దినేష్, హీరోయిన్ దివిజాతో పాటు సీనియర్ నటి సుధా, మురళీధర్‌గౌడ్ , బలగం నారాయణ, జబర్దస్త్ సత్య, జానపద గాయని కోమలి నటిస్తున్నారు. ఈ సినిమాను మార్చి 30న రిలీజ్ చేయనున్నట్టు దర్శకుడు దినేష్ తెలిపారు.

బొమ్మని గీస్తే అచ్చు దిగాల్సిందే...

బొమ్మని గీస్తే అచ్చు దిగాల్సిందే.. కుంచె చేత పడితే సహజత్వం ఉట్టిపడాల్సిందే.. డ్రాయింగ్, పెయింటింగ్ వేస్తే ఎవరైనా ఔరా అనాల్సిందే.. తెనుగుబూడి గురుకులం విద్యార్థులు సామాజిక స్పృహ కలిగించేలా చిత్రాలను కళ్లకు కట్టినట్లుగా గీసి అబ్బురపరుస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు కొల్లగొడుతున్నారు.


అబ్బుర పరుస్తున్న తెనుగుపూడి గురుకుల విద్యార్థుల గీసిన చిత్రం


ప్రత్యేక ఆకర్షణగా పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఆహ్లాదకర చిత్రాలు


ఆకట్టుకుంటున్న గురుకుల విద్యార్థులు గీసిన బొమ్మలు

- ఆర్ట్స్‌లో అదరగొడుతున్న తెనుగుపూడి గురుకుల విద్యార్థులు
- నలుగురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్
- అంతర్జాతీయ పోటీల్లో ఇద్దరు సత్తా
- సహజత్వం ఉట్టి పడేలా చిత్రాలు
- జాతీయ నాయకులు, జంతువులు, పక్షుల బొమ్మలు అదుర్స్
- సందేశాత్మక చిత్రాలతో అబ్బురపరుస్తున్న వైనం


తెనుగుపూడి గురుకులంలో విద్యార్థులకు శిక్షణిస్తున్న ఆర్ట్ టీచర్ అర్జునరావు


గురుకుల విద్యాయంలో ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎస్‌ఐ మల్లేశ్వరరావు, ప్రిన్సిపాల్ రఘు

దేవరాపల్లి: చిత్రలేఖనం పోటీల్లో తెనుగుపూడి గురుకుల విద్యార్థులు పాల్గొన్నారంటే పతకాలు వారి సొంతం కావాల్సిందే అనడంలో అతిశయోక్తి లేదు. ఆర్ట్ టీచర్ జి.అర్జునరావు శిక్షణలో 20 మంది విద్యార్థులు జంతువులు, పక్షుల బొమ్మలతో పాటు సందేశాత్మక చిత్రాలకు పెయింటింగ్ వేసి ఔరా అనిపిస్తున్నారు. మహాత్మాగాంధీ, డా. బి.ఆర్. అంబేడ్కర్, సర్వేపల్లి రాధాకృష్ణ, జవహర్ లాల్ నెహ్రూ, స్వామి వివేకానంద, సుభాష్ చంద్ర బోస్, మదర్ థెరిసా తదితర మహనీయులతో పాటు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రాలను గీసి అబ్బురపరుస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, శక్తి పునరుత్పాదన, భూగర్భ జలాల ఆవశ్యకత, పల్లె వాతావరణం, సామాజిక రుగ్మతలు, చారిత్రక ప్రదేశాలు తదితర సామాజిక అంశాలపై ప్రజలకు చైతన్యం కలిగించేలా చిత్రాలు గీసీ, పెయింటింగ్ వేస్తూ సత్తా చాటుతున్నారు. మహిళల చిత్రాలను జీవం పోసినట్లు ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. ఈ క్రమంలోనే రాష్ట్ర, జాతీయ స్థాయి ఆర్ట్స్ కాంపిటేషన్‌లలో నలుగురు విద్యార్థులు బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. ఇద్దరు జాతీయ స్థాయి పోటీలలోను, మరో ఇద్దరు అంతర్జాతీయ పోటీలలో పాల్గొని సత్తా చాటారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో..

జాతీయ స్థాయిలో ముంబైలో గత ఏడాది ఆగస్టులో జరిగిన ఆర్ట్స్ పోటీలలో పదో తరగతి విద్యార్థి ఎల్. ఆకర్ష్, ఎల్. దినేష్ పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయి ఆన్‌లైన్ పోటీల్లో స్థానిక గురుకుల విద్యాలయానికి చెందిన లెక్కల దినేష్, పైలా నర్సయ్య, ఆకర్ష్, సంజయ్‌కుమార్ తదితర 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీటి ఫలితాలు వెలువరించాల్సి ఉంది.

గోల్డ్ మెడల్స్ పొందిన విద్యార్థులు వీరే....


గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డీసీవో రూపావతి

- **పదో తరగతి విద్యార్థి** లింగాల ఆకర్ష్ గత **ఏడాది ఫిబ్రవరిలో** క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకా**డమీ వారు అమరావతి**లో ఏర్పాటు చేసిన **నేషనల్ ఆర్ట్ కాంపిటేషన్‌**లోను బంగారు పతకాన్ని కై**వసం చేసుకున్నాడు.**
- **పదో తరగతి విద్యార్థి** బి. సంజయ్‌కుమార్ గత ఏడాది నవంబర్‌లో కాలయజ్ఞ సృష్టి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా జరిగిన నేషనల్ చిల్డ్రన్, యూత్ పెయింటింగ్ కాంపిటేషన్‌లో గోల్డ్ మెడల్‌ను అందుకున్నాడు.
- 7వ తరగతి విద్యార్థి లెక్కల దినేష్, ఆలిండియా క్రియేటివ్ ఫైనాన్స్ చిల్డ్రన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన పోటీలోను, ప్రకాశం జిల్లా కాలయజ్ఞ సృష్టి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ చిల్డ్రన్, యూత్ పెయింటింగ్ కాంపిటేషన్‌లో గోల్డ్ మెడల్స్‌ను సొంతం చేసుకున్నాడు.
- టెన్త్ విద్యార్థి పైలా నర్సయ్య, గుంటూరులో జరిగిన క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమి వారు అమరావతిలో ఏర్పాటు చేసిన నేషనల్ ఆర్ట్ కాంపిటేషన్‌లో గోల్డ్ మెడల్స్‌ను సొంతం చేసుకున్నాడు.

గోల్డ్ మెడల్ రావడం ఆనందంగా ఉంది



గుంటూరులో క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పెయింటింగ్ ఫేర్‌లో గోల్డ్ మెడల్ అందుకోవడం ఆనందంగా ఉంది. ముంబైలో జరిగిన జాతీయ ఆర్ట్స్ కాంపిటేషన్‌లో ఫలితాలు రావాల్సి ఉంది. మా పాఠశాలలోని ఆర్ట్స్ టీచర్ ఇచ్చిన తర్ఫీదు, ప్రోత్సాహంతోనే బొమ్మలు గీయడం, పెయింటింగ్ వేయడంపై దృష్టి సారించాను.

– ఎల్. ఆకర్ష్, పదో తరగతి విద్యార్థి గురుకులం, తెనుగుపూడి

సత్తా చాటేలా తీర్చిదిద్దుతున్నారు



అంతర్జాతీయ స్థాయి ఆన్‌లైన్ ఆర్ట్స్, పెయింటింగ్ పోటీలలో పాల్గొనడం నా అదృష్టం. ఆగస్టులో జరిగిన ఈ పోటీల ఫలితాలు కోసం ఎదురు చూస్తున్నాను. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో వేర్వేరుగా జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్ట్స్ కాంపిటేషన్‌లో రెండు బంగారు పతకాలు సాధించడం సంతోషంగా ఉంది. ప్రిన్సిపాల్ రఘు సార్, ఆర్ట్ సార్ అర్జునరావు ప్రత్యేక శిక్షణిచ్చి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో సత్తా చాటేలా తీర్చిదిద్దుతున్నారు.

– ఎల్. దినేష్, 7వ తరగతి, విద్యార్థి, గురుకులం, తెనుగుపూడి

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం



గతేడాది ప్రకాశం జిల్లాలో జరిగిన నేషనల్ చిల్డ్రన్ ఆర్ట్స్, పెయింటింగ్ కాంపిటేషన్‌లో పర్యావరణ పరిరక్షణ, నేచరల్ ఎనర్జీ కన్జర్వేషన్‌పై గీసిన చిత్రానికి గోల్డ్ మెడల్ వచ్చింది. ఆర్ట్స్, పెయింటింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే తన లక్ష్యం. ఆదిశగా కృషి చేస్తున్నాను.

– బి.సంజయ్‌కుమార్, టెన్త్ విద్యార్థి, గురుకులం, తెనుగుపూడి

ఆర్ట్స్, పెయింటింగ్స్‌తో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



ఆర్ట్స్‌పై దృష్టి సారించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది. ఆలోచన శక్తి, ఓపిక, సహనం పెరిగి నిత్యం ఉల్లాసంగా ఉంటారు. ఆర్ట్స్, పెయింటింగ్‌లో రాణించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ప్రస్తుతం ఆర్ట్స్, డ్రాయింగ్‌లకు డిమాండ్ ఉంది. వీటికి ప్రత్యేక కోర్సులు సైతం అందుబాటులో ఉన్నాయి. ఈ క్రమంలోనే విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదునిచ్చి, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి కాంపిటేషన్‌లకు పంపిస్తున్నాం.

– జి.అర్జునరావు, ఆర్ట్ టీచర్, గురుకులం, తెనుగుపూడి

మాకు ఎంతో గర్వకారణం



ఆర్ట్స్, పెయింటింగ్‌లో మా పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ దక్కడం అభినందనీయం. ఇద్దరు విద్యార్థులు జాతీయ, మరో ఇద్దరు అంతర్జాతీయ పోటీలలో పాల్గొనడం మాకు ఎంతో గర్వకారణం. ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల విద్యాలయాల సమన్వయకర్త ఎస్.రూపావతి గోల్డ్ మెడల్స్ పొందిన విద్యార్థులను, తర్ఫీదునిచ్చిన ఆర్ట్ టీచర్ జి. అర్జునరావును ఇటీవల ప్రత్యేకంగా అభినందించారు. విద్యతో పాటు క్రీడలు, ఆర్ట్, పెయింటింగ్ కాంపిటేషన్‌లో రాణించేలా ప్రత్యేక శిక్షణిస్తున్నాం.

– పి.రఘు, ప్రిన్సిపాల్, గురుకుల విద్యాలయం, తెనుగుపూడి

ప్రధాని పర్యటన విజయవంతం చేయాలి


కలెక్టర్ విజయ కృష్ణన్, ఎంపీ సీఎం రమేష్


మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎంపీ సీఎం రమేష్

తుమ్మపాల: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న విశాఖపట్నం వస్తారని, అక్కడ నుంచి వర్చువల్ విధానంలో నక్కపల్లి, అచ్యుతాపురంల వద్ద రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కేంద్రం నుంచి జిల్లాకు రూ.రెండు లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు వస్తున్నాయని, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. త్వరలోనే జిల్లాకు అల్యూమినియం పరిశ్రమ రానున్నట్లు ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. ప్రధాని సభకు జిల్లా నుంచి 40వేల మంది హాజరుకానున్నట్లు చెప్పారు, వారికి 800 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాడుగుల, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాలలోనూ పరిశ్రమలు స్థాపనకు ప్రణాళిక రూపొందించామన్నారు. యలమంచిలి, మాడుగులలో అదనంగా కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటుకు, మాడుగులలో ఇంజినీరింగు యూనివర్సిటీ స్థాపనకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం నుంచి పాడేరుకు 16వ నంబర్ జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ రోడ్డు నిర్మాణం, తుని నుంచి విజయనగరం జిల్లాను కలుపుతూ నర్సీపట్నం మాడుగుల, చోడవరం మీదుగా జాతీయ రహదారి నిర్మాణం, పోర్టులను అనుసంధానం చేస్తూ సముద్ర తీరంలో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించామన్నారు. మాడుగుల, యలమంచిలి ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ కుమార్, జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్‌పార్క్ పనులు వేగవంతం

పరిశీలించిన ఆర్డీవో


పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

నక్కపల్లి: మండలంలో బల్క్‌డ్రగ్ పార్క్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వీటిలో భాగంగా ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో జంగిల్‌క్లియరెన్స్ ప్రారంభించారు. రాజయ్య పేట, పెదతీనార్ల, బోయపాడు, చంద నాడ, బుచ్చిరాజుపేట తదితర గ్రామాల పరిధిలో రెండు వేల ఎకరాల్లో బల్క్ డ్రగ్‌పార్క్ ఏర్పాటు కానుంది. ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఈ భూముల్లో మామిడి, కొబ్బరి, జీడితోటలను తొలగించేపనులు ప్రారంభించారు. రాజయ్యపేటలో సర్వే నంబర్లు 259, 279లో సుమారు 500 ఎకరాల్లో కొబ్బరి, జీడితోటలను తొలగిస్తున్నారు. శుక్రవారం ఈ జంగిల్ క్లియరెన్స్ పనులను నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ పరిశీలించారు. తహసీల్దార్ నర్సింహమూర్తి, ఏపీఐఐసీ అధికారులు ఆర్డీవోకు పనుల వివరాలు తెలిపారు. రూ.2,159 కోట్లతో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. రసాయన పరిశ్రమలకు అవసరమైన ముడి సరుకు యూనిట్లు ఏర్పాటుకు సంబంధించి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి ప్లాట్లుగా విభజించిప్రైవేటు కంపెనీలకు విక్రయిస్తుంది.

గంజాయి నిందితులకు 10 ఏళ్ల జైలు శిక్ష

- ఇద్దరికి రూ.లక్ష చొప్పున జరిమానా

చోడవరం రూరల్: గంజాయి అక్రమ రవాణా కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరు నిందితులకు ఒక్కొక్కరికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ చోడవరం తొమ్మిదో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.రత్నకుమార్ తీర్పు చెప్పారు. కోర్టు వర్గాలు అందించిన సమాచారం మేరకు... అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీ మండలం బొండం గ్రామానికి చెందిన నిందితులు పంచాడి సునీల్ కుమార్, గొల్లిరి వీరాస్వామి చెరొక బ్యాగులో గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. 2013 డిసెంబర్ నెల 3వ తేదీన వీరిద్దరూ ఆర్టీసీ బస్సు(ఏపీ 28జడ్ 5834లో ప్రయాణిస్తుండగా ముందుగా అందిన సమాచారం మేరకు అదే జిల్లా అనంతగిరి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫసర్ ఎల్. రామకృష్ణ తమ సిబ్బందితో తనిఖీ నిర్వహించగా, నిందితులు పట్టుబడ్డారు. వీరి నుంచి రెండు బ్యాగుల్లో పదేసి కిలోల గంజాయితో దొరికారు. వీరి నుంచి 20 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులపై నేరారోపణ అభియోగ పత్రాన్ని ఎస్‌ఐ రామకృష్ణ న్యాయస్థానంలో దాఖలు చేయడంతో పాటు సాక్షులను కోర్టు ముందుంచారు. నిందితులపై మోపిన అభియోగం సాక్ష్యాధారాలతో రుజువు కావడంతో శుక్రవారం న్యాయమూర్తి రత్నకుమార్ వారికి కారాగార శిక్ష, జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తన తీర్పులో వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరపున న్యాయవాది ఉగ్గిన వెంకటరావు తన వాదనలు వినిపించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, అప్పటి ఎస్‌ఐ రామకృష్ణ, న్యాయవాది వెంకటరావు, సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచి, నిందితులపై మోపిన అభియోగం రుజువయ్యేలా కృషి చేసిన కోర్టు మానిటరింగ్ సిబ్బందిని అభినందించారు.

నూనెగింజల సాగు దత్తత గ్రామాలుగా వెంకుపాలెం, దిబ్బపాలెం

- కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ


రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త శైలజ, ఏడీ రామారావు

తుమ్మపాల: సమగ్ర యాజమాన్య చర్యల ద్వారా నూనె గింజలలో అధిక దిగుబడి సాధించవచ్చని బీసీటీ-కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా అన్నారు. జాతీయ నూనె గింజల భద్రత పథకంలో భాగంగా మండలంలో వెంకుపాలెం, దిబ్బపాలెం గ్రామాల్లోని వేరుశనగ, పొద్దుతిరుగుడు, నువ్వు పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. రబీలో వీటి ఉత్పత్తికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఏడీ ఎం.రామారావు మాట్లాడుతూ నూనె శాతం పెరగడానికి గంధకాన్ని, సింగిల్ సూపర్ ఫాస్పేట్ రూపంలో వాడడం ఉత్తమమని అన్నారు. నూనె గింజల సాగులో రెండు గ్రామాలు ఆదర్శంగా గుర్తించబడ్డాయన్నారు. అధిక శాతం నువ్వు గింజల సాగుకు కృషి చేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావుతోపాటు రైతులను అభినందించారు. 46 మంది రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ దాడి గణేష్, వ్యవసాయ సహాయకులు మోహన్, రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు కృష్ణవేణి, సుధారాణి, అభ్యుదయ రైతులు సాంబశివరావు, కన్నం నాయుడు పాల్గొన్నారు.

తహసీల్దారు తీరుపై సచివాలయ ఉద్యోగుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

పాయకరావుపేట: స్థానిక తహసీల్దారు జి.సత్యనారాయణ ప్రవర్తన పట్ల సచివాలయ ఉద్యోగులు ఆగ్రహించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావుకు ఫిర్యాదు చేశారు. మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో, తహసీల్దారు, ఈవోపీఆర్డీ కలిసి సత్యవరం సచివాలయం -1 పరిధిలో గురువారం సామాజిక పింఛన్ల తీరుపై విచారణ చేపట్టారు. ఈ క్రమంలో పింఛన్‌దారును పిలుద్దామని ఇంజనీరింగ్ అసిస్టెంట్ కె.విజయరాజు విచారణ స్థలం నుంచి పక్కకు వెళ్తున్నాడు. అక్కడే ఉన్న తహసీల్దారు జి.సత్యనారాయణ దురుసుగా, అమానవీయంగా రాజును చేతితో నెట్టి వేశారు. దీంతో సచివాలయ ఉద్యోగి తీవ్రంగా కలత చెంది, అవమానానికి గురైనట్లు విలేకరుల వద్ద వాపోయాడు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సచివాలయ ఉద్యోగులు కోరారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ.. మృత్యుఒడిలోకి


మృతి చెందిన గుబ్బ తిరుపతి స్వామి

భీమడోలు: తిరుపతి దర్శనానికి వెళ్లి వస్తుండగా.. లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో కారు డ్రైవర్ మృతి చెందాడు. జాతీయ రహదారిపై ఏలూరు జిల్లా భీమడోలు మండలం అంబర్‌పేట పంచాయతీ శివారు కొండ్రెడ్డినగర్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో గుబ్బ తిరుపతి స్వామి(56) మృతి చెందాడు. ఓ మహిళకు తీవ్ర గాయాలు కాగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం గుంటపల్లి గ్రామానికి చెందిన గుబ్బ తిరుపతి స్వామి కారులో గంటా గోవింద్ కుటుంబానికి చెందిన అమలావతి, అలేఖ్య, లక్ష్మీ, సందీప్, అవినాష్ ఈనెల ఒకటిన తిరుపతి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కొండ్రెడ్డినగర్ వద్ద ట్రాలీ లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. ఇది గమనించని కారు డ్రైవర్ గుబ్బ తిరుపతి స్వామి అతివేగంగా వెనుక నుంచి లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయాలైన తిరుపతి స్వామి(56)ని హైవే అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాదంలో తీవ్రగాయాలైన గంటా అమలావతిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిలిగిన ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి అల్లుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

సమన్వయంతోనే పాఠశాలల అభివృద్ధి



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో మాట్లాడుతున్న ఎంఈవో సురేష్‌కుమార్

కశింకోట: స్కూల్ నిర్వహణ కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పని చేసి పాఠశాలల అభివృద్ధికి దోహదపడాలని ఎంఈవో కె.సురేష్‌కుమార్ కోరారు. కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం మండల స్థాయి స్కూల్ నిర్వహణ కమిటీ చైర్మన్లు, హెచ్‌ఎంలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్‌ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలు తమ విధులు, బాధ్యతల గురించి తెలుసుకొని పాఠశాలల ప్రగతికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 కె.ఎస్.ఎన్.మూర్తి, డీఆర్‌పీలు వై.శ్రీనివాసరావు, ఎస్.రమణ, సీఆర్‌ఎంలు పి.సత్యబాబు, ఝాన్సీ, ఎం.రామలక్ష్మి పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయానికి వంట పాత్రల పంపిణీ



వంట పాత్రలు అందిస్తున్న తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాసరావు

కశింకోట: కశింకోటలోని కోమటి వీధిలో ఉన్న సాయిబాబా ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు శుక్రవారం వంట పాత్రలు అందజేశారు. కుర్చీల కోసం రూ.10 వేలు అందించారు. కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనకాపల్లి: బవులవాడ గ్రామానికి చెందిన గొల్లవిల్లి అప్పారావు(50) ఈ నెల ఒకటో తేదీన పశువులను మేపుతున్న సమయంలో పక్కనే ఉన్న తాటిచెట్టు పడి గాయపడ్డాడు. ఆయనను హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. గతంలో ఆ తాటిచెట్టుపై పిడుగుపడి పాడైపోయిందన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 3,288 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,000	5,250
మొదటి రకం	4,000	5.400
రెండో రకం	3,460	4,240
మూడోరకం	3,110	3,450

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	:	సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	:	సత్యనారాయణ స్క్రీన్-2
యూఐ	:	పర్తిసాయి
మ్యాక్స్	:	షిర్డీసాయి
క్రేవిన్ ది హంటర్	:	వెంకటేశ్వర
సై	:	శ్రీసత్య
మార్కో	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 20 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–2 యూనిట్లు, బీ పాజిటివ్–7 యూనిట్లు, ఓ పాజిటివ్–9 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను 97036 19706 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 368 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924–223595 నంబరులో సంప్రదించవచ్చు.

బైపాస్ సర్వీస్ రోడ్డుకు మోక్షమెప్పుడో?

- బైపాస్ జంక్షన్ నుంచి శంకరం పులికాలువ వరకు నిలిచిన రోడ్డు పనులు
- వాహనచోదకులకు తప్పని పాట్లు



అసంపూర్తిగా సర్వీస్ రోడ్డు

తుమ్మపాల: అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారికి ఆనుకుని నిర్మించిన సర్వీస్ రోడ్డు శంకరం పులికాలువ నుంచి బైపాస్ జంక్షన్ వరకు అసంపూర్తిగా నిలిచిపోయింది. దాదాపు రూ.2500 కోట్లతో సుమారు 40 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రోడ్డును అభివృద్ధి చేసినప్పటికీ పట్టణానికి ముఖద్వారంలా ఉన్న బైపాస్ జంక్షన్ నుంచి ఆనందపురం వైపు సర్వీస్ రోడ్డును 2 కిలోమీటర్ల మేర పూర్తి చేయలేకపోయారు. దీంతో అటు విశాఖ, ఇటు విజయవాడ రోడ్డు మీదుగా వచ్చే స్థానిక ప్రయణికులు ఆనందపురం రోడ్డు వైపునకు సర్వీస్ రోడ్డు మీదుగా వెళ్లలేకపోతున్నారు. మరోవైపు కిలోమీటర్ల మేర రాంగ్ రూట్‌లో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. చివరకు వాహనచోదకులు అనకాపల్లి పట్టణంలోకి వచ్చి శంకరం వద్ద జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుకు చేరుకోవడంతో పట్టణంలో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిని 2023లోనే పూర్తి చేసినప్పటికి పులికాలువ వరకు సర్వీస్ రోడ్డును పూర్తి చేయకుండా వదిలేయడంపై సమీప గ్రామాల ప్రజలు, రైతులు, వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

డివైడర్‌లు దాటి హైవేపైకి..

శంకరం పులికాలువ దాటి రైల్వేట్రాక్ వద్ద కట్ అవ్వడంతో తిరిగి వెనక్కి వచ్చి శంకరం వద్ద వాహనాలతో జాతీయ రహదారి డివైడర్లు దూకి ప్రవేశిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు డివైడర్‌కు ఉన్న ఇనుప గ్రిల్స్‌ను కటింగ్ చేసి వాహనాలకు మార్గం సుగమం చేశారు. దీంతో వాహనచోదకులు జాతీయ రహదారిలోకి ప్రవేశించి బైపాస్ జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్డుకు చేరుకుంటున్నారు. ఇక్కడ దాదాపు 120 కిలోమీటర్ల మేర వేగానికి అనుమతి ఉంది. ఇలా సర్వీస్ రోడ్డు నుంచి వాహనాలు జాతీయ రహదారికి చేరడంతో ఘోర ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.



పులికాలువ దాటాక నిలిచిపోయిన సర్వీస్ రోడ్డు నిర్మాణం

రైల్వే వంతెన లేక నిరాశ

పట్టణంలో బైపాస్ జంక్షన్ విశాఖపట్టణం, విజయవాడ, ఆనందపురం మూడు ప్రాంతాల వైపు రాకపోకలకు కూడలిగా ఏర్పడింది. జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా ఆయా ప్రాంతాలకు సులభంగా చేరుకునేలా అతిపెద్ద ఇంటర్ లింక్ రోడ్డును నిర్మించినప్పటికీ ఆనందపురం వైపు సర్వీస్ రోడ్డు కనిపించకపోవడంతో ప్రయాణికులు ఇప్పటికీ తికమకపడుతున్నారు. అక్కడి నుంచి కేవలం కిలోమీటర్ దూరంలోనే ఆనందపురం రోడ్డును రైల్వేట్రాక్ క్రాస్ చేయడంతో సర్వీస్ రోడ్డు నిర్మాణం వదిలేసి నాలుగు రోడ్లకు మాత్రమే ఫ్లైఓవర్ వేశారు. ఆనందపురం మీదుగా సర్వీస్ రోడ్డులో రాకపోకలు చేసే ప్రయాణికులు రైల్వే ట్రాక్ వరకు వెళ్లి సర్వీస్ రోడ్డు లేకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. పులికాలువ జంక్షన్ నుంచి అనకాపల్లి పట్టణంలోకి చేరి అక్కడి నుంచి బైపాస్‌కు చేరుకుని తమ గమ్యానికి చేరుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి.

సర్వీస్ రోడ్డు త్వరగా పూర్తి చేయాలి



శంకరం పులి కాలువ నుంచి బైపాస్ జంక్షన్‌కు జాతీయ రహదారికి అనుసంధానంగా సర్వీస్ రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. విశాఖ, విజయవాడ వైపు వెళ్లాల్సి వచ్చినప్పుడు జాతీయ రహదారి ద్వారా సర్వీస్ రోడ్డుపై ప్రయాణించేందుకు అవకాశం లేక అనకాపల్లి పట్టణంలోకి వచ్చి బైపాస్ జంక్షన్‌కు వెళ్లాల్సి వస్తోంది. సర్వీస్ రోడ్డు పూర్తి చేస్తే దూరం, ట్రాఫిక్ సమస్య ఉండదు.

– బద్ది వెంకటేష్, రేబాక గ్రామం

మందుబాబులకు అడ్డాగా సర్వీస్ రోడ్డు



శంకరం వద్ద పులికాలువ జంక్షన్ నుంచి రైల్వేట్రాక్ వరకు జాతీయ రహదారి ఆనుకుని నిర్మించిన సర్వీస్ రోడ్డు నిరుపయోగంగా మిగిలిపోయింది. రైల్వేట్రాక్ వద్ద వంతెన వేయకుండా సర్వీస్ రోడ్డు పనులు నిలిపివేయడంతో అక్కడ మందుబాబులకు అడ్డాగా తయారైంది. అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డును పూర్తి చేయాలి.

– బీశెట్టి అప్పారావు, సీహెచ్ఎన్ అగ్రహారం

13న కొణతాల రామలింగ స్వామి పురస్కారాల ప్రదానం

అనకాపల్లి: ఈ నెల 13న కొణతాల రామలింగ స్వామి పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి కొణతాల లక్ష్మీపార్వతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రం రహదారిలోని ఉప్పల చంద్రశేఖరరావు కల్యాణ మండపంలో ఆరోజు సాయంత్రం 5 గంటలకు ఈ వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయ రంగంలో విజయనగరం జిల్లాకు చెందిన డాక్టర్ బొంతలకోటి శంకరరావుకు, సేవా రంగంలో హైదరాబాద్‌కు చెందిన సర్వేనీడ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సి.గౌతమ్ కుమార్‌కు, విశాఖ మమతా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎల్లేటి మమతకు, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరికి చెందిన సంఘ సేవకుడు నాగూలు ఆదేషాకు, తెలంగాణా రాష్ట్రం భద్రాది కొత్తగూడెంకు చెందిన ప్రకృతి హరిత దీక్ష, గ్రీన్ మోటార్ వెహికల్ గార్డెన్ వ్యవస్థాపకుడు కొత్తూరు సుర్వి రాజశేఖర్‌కు, ఉత్తమ విద్యార్థి రంగంలో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలానికి చెందిన ఎంబీబీఎస్ పూర్తి చేసి, యూపీఎస్సీ ఇంటర్వ్యూకు ఎంపికైన రావాడా సాయి మోహినిమానసకు అవార్డులు ప్రదానం చేస్తామన్నారు.

పూరిల్లు దగ్ధం

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాకలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలో గొల్లవీధిలో పంచదార్ల వెంకటరమణకు చెందిన పూరింట్లో వంట చేస్తున్న సమయంలో కట్టెల పొయ్యి నుంచి నిప్పురవ్వలు ఎగిరి తాటికమ్మలపై పడ్డాయి. దీంతో మంటలు వ్యాప్తి చెందాయి. సమాచారం అందుకున్న యలమంచిలి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ప్రమాద స్థలానికి శకటంతో వెళ్లి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.75 వేల ఆస్తి నష్టం వాటిల్లగా.. సుమారు రూ.1.25 లక్షల విలువైన ఆస్తిని కాపాడినట్టు అగ్నిమాపక కేంద్రం అధికారి రాంబాబ తెలిపారు.

మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయం



మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పలు రాజకీయ పార్టీల నేతలు

అనకాపల్లి: స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంస్మరణ సభ పలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ పాలనలో భారత్ ప్రపంచ దేశాల్లో 5వ స్థానంలో నిలిచిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ మాట్లాడుతూ మన్మోహన్ హయాంలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ సింగ్ చేసిన సేవలు నేటికి చిరస్థాయిగా నిలిచిపోయాయని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ 20వ శతాబ్దంలో భారత ఆర్థిక వ్యవస్థను మరింతగా వృద్ధి చేయడంలో మన్మోహన్ పాత్ర మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు గంటా శ్రీరామ్, మలపురెడ్డి కోటేశ్వరరావు, కె.చిన్నబాబు, బోయిన బానుమూర్తి యాదవ్, కాళ్ల సత్యనారాయణ, తట్ట రమణ, సత్యనారాయణ, బొంతి రమణ, కత్తెర శ్రీధర్, పి.ఎస్.దత్తు, టి.గణపతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన, దళిత ప్రజాప్రతినిధులపై వివక్ష

- రెవెన్యూ సదస్సుకు ఆహ్వానించని అధికారులు
- సర్పంచ్ గొలగాని రాణి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స ఆవేదన



మాట్లాడుతున్న సర్పంచ్ గొలగాని రాణి, పక్కన జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స

నాతవరం: గిరిజన మహిళ కావడంతోనే రెవెన్యూ సదస్సుకు అధికారులు తనను ఆహ్వానించలేదని నాతవరం సర్పంచ్ గొలగాని రాణి ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం నాతవరం సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. దీనికి సంబంధించి గిరిజన సర్పంచ్ రాణికి, దళిత జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్సకు కనీసం సమాచారం ఇవ్వలేదు. ఈ విషయంపై వారు స్థానిక సచివాలయంలో మాట్లాడుతూ పంచాయతీ పాలకవర్గంలో వార్డు మెంబరు సైతం లేని కూటమి పార్టీ నాయకులను గ్రామసభలో తహసీల్దార్ పక్కన కూర్చోబెట్టుకుని సదస్సు నిర్వహించారన్నారు. తాము అక్కడకు వెళ్లగా మరిచిపోయామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అక్కడ వేదికపైకి ఆహ్వానించకపోవడంతో అవమానంతో సచివాలయం లోపలకు వెళ్లి పోయామన్నారు. అసెంబ్లీ స్పీకరు అయ్యన్నపాత్రుడు ఇలాకాలో గిరిజన, దళిత మహిళలకు అవమానం జరగడం శోచనీయమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఉప సర్పంచ్ కరక అప్పలరాజు పాల్గొన్నారు.

శ్రీరాముని అవతారంలో వెంకన్న కనువిందు



కశింకోటలో శ్రీరామ అవతారంలో ధ్యాన వేంకటేశ్వరస్వామి



గవరపేటలో రామావతారంలో వేంకటేశ్వరస్వామి

కశింకోట: కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి శ్రీరామునిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా విష్ణుమూర్తి దశావతారాల్లో ఏడో అవతారమైన శ్రీరామునిగా అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. రాత్రి నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. స్థానిక గవరపేటలో కొలువైన ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని కూడా ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీరామునిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు.

బకాయిల కోసం పారిశుధ్య కార్మికుల ధర్నా

అనకాపల్లి: జోనల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. స్థానిక జోనల్ కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ చెందిన ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. అదనంగా నియమించిన 15 మంది కార్మికులకు 8 మాసాలుగా జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. పారిశుధ్య వాహనంలో లోడింగ్ చేస్తున్న 28 మంది కార్మికులకు నాలుగు నెలల బకాయి జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి యర్రంశెట్టి శివకుమార్, నిమ్మకాయల అజయ్, సంతోష్, ఎర్రంశెట్టి ఓంశివ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి



వేల్పులవీధి టౌన్ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ కార్యదర్శి ఎ.ఓంరామ్



నెహ్రూచౌక్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడుతున్న బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కె.ఎం.నాయుడు



తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ జి.గ్రేస్, ఉపాధ్యాయులు, బాలికలు

అనకాపల్లి: పట్టణ, మండలంలో పలు ప్రాంతాల్లో దేశంలో మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక నెహ్రూచౌక్‌లో సావిత్రిబాయి చిత్రపటానికి బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కె.ఎం.నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి భర్త జ్యోతీరావు పూలే సహాయంతో ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి, బాలికా విద్య ఉద్యమానికి పునాది వేశారన్నారు. ఆమె చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కన్వీనర్ ఆడారి కుమారస్వామి, ఎస్సీసెల్ కన్వీనర్ దూలం బూసిరాజు, డీటీ శ్రీరామమూర్తి, జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు, పలు సంఘాల నాయకులు బొట్టా చిన్నయాదవ్, పిల్లా రాజు, దాడి జగన్, సూరిశెట్టి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

- నేటి యువత, మహిళలు సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని న్యాయవాది చిట్టా జయ అన్నారు. గాంధీనగరం తమ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు ఎలుగుబంటి సుధా, ఐఆర్.గంగాధర్, అవినాష్, ఓడిబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక జీవీఎంసీ గాంధీనగరం ప్రభుత్వ హైస్కూల్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి విగ్రహానికి హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.లలిత కుమారి, జీఎన్‌బీఎంకేపీ మంగమ్మ, సూర్యకుమారి, లెక్కల నాగలక్ష్మి, ఎం.విక్టోరియా రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.
- స్థానిక వేల్పులవీధి టౌన్ బాలికోన్నత పాఠశాలలో మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి విగ్రహానికి మహిళా ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న కె.పద్మజ, పి.రత్నం, కె.జ్యోతిని ఫెడరేషన్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ కార్యదర్శి ఎ.ఓంరామ్, పట్టణ అధ్యక్షుడు టి.సంధ్యాకుమారి, కార్యదర్శి ఎ.రమణ, కోశాధికారి సీహెచ్.రమణ, సహాయ కార్యదర్శి బి.వి.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి చిత్ర పటానికి ప్రిన్సిపాల్ జి.గ్రేస్ పూలమాల వేసి నివాళులర్పించారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి నిరుపమానమైన సేవలందించారని కొనియాడారు. జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు, వైస్ ప్రిన్సిపాల్ జె.మెర్సీ, ఉపాధ్యాయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



గాంధీనగరం హైస్కూల్‌లో సావిత్రిబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు, తదితరులు

వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ చికిత్సలు

యలమంచిలి రూరల్: పట్టణంలో ప్రజలను హడలెత్తిస్తున్న వీధి కుక్కల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు ప్రారంభించారు. విపరీతంగా పెరిగిపోయిన వీధి కుక్కల సంఖ్యను అదుపు చేసేందుకు గర్భధారణ నియంత్రణ శస్త్ర చికిత్సలు శుక్రవారం నిర్వహించారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ప్రత్యేకంగా శస్త్ర చికిత్సల కోసం ప్రత్యేక గదితో పాటు, సర్జరీ తర్వాత కుక్కల సంరక్షణకు ప్రత్యేక వసతి నిమిత్తం ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. శుక్రవారం పట్టణంలోని పలు వీధుల్లో శునకాలను మున్సిపల్ సిబ్బంది పట్టుకుని, వాటిని ప్రత్యేక వాహనంలో పశువైద్యశాలకు తరలించారు. తర్వాత వాటికి సర్జరీలు నిర్వహించారు. తొలిరోజు 10 శునకాలకు ఆపరేషన్లు పూర్తి చేశారు. వీధి కుక్కల సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్సలు చేసేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్టు మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తెలిపారు.

గజ వాహనంపై గోవిందుడు



గజ వాహనంపై స్వామివారికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాకలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా స్వామివారికి రోజుకొక వాహనంపై తిరువీధి నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం కల్కి అవతారంలో వెలసిన స్వామివారికి పంచామృతాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. కొండదిగువ ఉత్సవమూర్తులకు క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, గోదాదేవి అమ్మవారికి నిత్య పూజలు చేశారు. అనంతరం ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని గజ వాహనంపైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి ఊరేగించారు. శ్రీదేవీ, భూదేవీ సమేతంగా స్వామివారు తమ చెంతకు తిరువీధి సేవల కోసం వస్తుండడంతో భక్తులు పసుపు, కుంకుమలు, కానుకలు సమర్పించారు. అనంతరం గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై పాశురం విన్నపం చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.